
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా,  తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ,  స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే  జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు..  ఈ మహానగరం కథలు..!!

# జ్ఞాపకాలు

' కెన్! మీరింత సరళంగా, సౌమ్యంగా ఎప్పుడూ ఒకేలా ఎలా ఉండగలరు? "ఆశ్చర్యంగా అడిగాను నేను.

ఎప్పటిలాగే పెదవులు విడీవిడనట్టుగా నవ్వాడు కెన్.

అప్పటివరకూ మా మేనేజర్ ప్రాజెక్ట్ జరుగుతున్న పని పట్ల తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తూ మమ్మల్నందరినీ పిలిచి మీటింగ్ లో ఎడా పెడా చివాట్లు పెట్టాడు. ఎంతో కష్టపడి చేస్తున్నామని అనుకుంటున్న మేమందరం ఆయన మాటలకి చాలా బాధపడ్డాం, కొందరైతే చాలా ఆవేశపడ్డారు. అందరికీ మూడ్ ఆఫ్ అయింది, ఎవరికీ పని ముట్టుకోబుద్ధి కాలేదు

'చెడ్డకాపురానికి ముప్పేముంది? ' అనుకుంటూ కేఫెటీరియా వైపుకి, చివాట్ల చిరాకుని తగ్గించుకోడానికి మరికొందరు లాన్ లో నడకకి బయలుదేరాం.

ఒక్క కెన్ మాత్రం మౌనంగా తన లాప్ టాప్ మడిచి చేతి కింద పెట్టుకుని తల వంచుకుని తన సీట్ కి వెళ్ళి, ఏమీ జరగనట్టు పనిచేసుకోసాగాడు.

సన్నగా, పొట్టిగా ఉంటాడు కెన్. చాలా కళగల సన్నటి ముఖం, సాల్ట్ పెప్పర్ జుట్టు, కళ్ళజోడు. మడత నలగని ఇస్త్రీ బట్టలు, ప్రశాంతతకి మారుపేరులా ఉండే వ్యక్తిత్వం

ఒక్క కెన్ తప్ప మా టీములో మిగిలిన నలభై మంది మరో గంట దాకా సీట్లదగ్గరకి రాలేకపోయారు. కెన్ మాత్రం తన పని తను చేసుకుంటూ కూర్చున్నాడు. నాకు ఆత్రం ఆగలేక మళ్ళీ వెళ్ళాను అతని దగ్గరకి.

నేను ఈ కంపెనీలో చేరి ఆరునెలలవుతోంది. నాకు మనుషులు కావాలి, అందరితోనూ అతి త్వరగా పరిచయం చేసుకుంటాను, అందరినీ నవ్వుతూ, వాళ్ళని నవ్విసూ ఆనందంగా ఉండడం నా నైజం.. అది అందరికీ నచ్చకపోవచ్చు, ముఖ్యంగా తమ పనేదో, తామేదో గా ఉండే ఈ దేశంలో. అయినా కొన్ని పుట్టుకతో వచ్చినవి పుడకలదాక పోవుట, మా బామ్మ చెప్పేది, నాకీ అలవాటు కూడా అంతేనేమో!

"కెన్.. కాఫీ తాగుదామా?ః అడిగాను నెమ్మదిగా. అతనికి కోపం రాదన్న ధైర్యం నాకుందిగా.. అయినా ఆయన ఎలా ఉంటే నాకెందుకు? నా పనేదో నేను చూసుకోక? అనుకున్నాను ఒకపక్క ఉన్నా సరే అడిగాను..

నవ్వుతూ నా వైపు చూశాడు.. "ఈ ఓల్డ్ మాన్ తో నీకెందుకు యంగ్ మాన్? అయినా అడిగావు గా.. పద కాఫీ తాగుదాం" అంటూ కేఫెటీరియా వైపు నడిచాడు. ఆవు వెనక దూడలా ఆయన వెనక నేను.. అప్పుడు చూశాను ఆయన నడుముకు వేలాడదీసుకున్న ఐ.డీ కార్డ్ మీద ఆయన ఫోటో.

ఆ ఫోటోలో చిన్నగా ఉన్నారు కెన్. పొడుగ్గా మెడవరకూ ఉన్న జుట్టు, ముఖం మీదకి పడుతోంది. సూటిగా ఉన్న చూపు..

" కెన్, మీరు చాలా బావున్నారు ఈ ఫోటోలో " అన్నాను వెంటనే.

నాకు వాగుడెక్కువ అన్న విషయం నాకు తెలుసు, అయినా కొన్ని అలవాట్లు మార్చుకోవడం కష్టమే.

చురుగ్గా చూశాడు నావైపు.. మళ్ళీ కళ్ళు దించుకుని నడవసాగాడు.

ఇద్దరూ కాఫీలు తెచ్చుకుని హాల్లో ఓ మూల ఖాళీగా ఉన్న ఓ టేబిల్ దగ్గర కూర్చున్నాం.

" చెప్పు శ్రీకర్! నీకేం కావాలి? నాతో ఏమైనా పనా?" అన్నాడు నెమ్మదిగా..

ఏం చెప్పాలో తెలీక కాఫీ నమలసాగాను..

"డోంట్ హెసిటేట్.. ఏం కావాలి?? అన్నాడు..

" నాకేమీ వద్దు! ఊరికే ఫ్రెండ్షిప్ చేసుకుందామనీ " అన్నాను నెమ్మదిగా.

" ఓ రియల్లీ! నేను నీతో ఫ్రెండ్లీగానే ఉన్నానుగా. నాలో సగం వయసు నీది, అదే ఇంచుమించుగా, నీ వయసుకుర్రాళ్ళ రుచులు, అభిరుచులూ, వేరుగా ఉంటాయి నాలాంటివాడితో చూస్తే. నువ్వు చాలా కలుపుగోరు మనిషివని గుర్తించాను ఈ ఆరునెలల్లో, పక్కవాళ్ళ సంగతి నాకెందుకు అనుకునే వయసువారి జెనెరేషన్ వాడివి నువ్వు, అయినా నువ్వు అందరినీ సరదాగా ఉంచాలని చేసే ప్రయత్నాలన్నీ నేను చూస్తూనే ఉన్నాను " అంటూ చెప్తున్న కెన్ ని మధ్యలోనే ఆపి

" దానికోసం కాదు, నాకు ఎప్పుడూ మీరు ఒకేలా ఎలా ఉంటారా? అని ఆశ్చర్యం గా ఉంటుంది. మీకసలెప్పుడూ కోపం రాదా?" అన్నాను ఊరుకోకుండా..

" అదేనా నీక్కావలసింది?" అన్నాడు నవ్వుతూ..

ఎప్పుడూ ఎక్కువ మాట్లాడని కెన్ అంత మాట్లాడడం నాకు నచ్చింది.

" నీకెందుకు అతనితో? ఏదో పెద్దాయన, తనేమో, తనపనేమో అన్నట్టుగా ఉంటాడు. వదిలెయ్యి నా స్నేహితుల మాటలు గుర్తొస్తున్నాయి..

" అవును, స్థితప్రజ్ఞత అంటారే? అది మీలో కనిపిస్తుంది.. అది చాలా అరుదైన లక్షణం కదా" అన్నాను.

"స్థితప్రజ్ఞతా?" అన్నాడు పెద్దగా నవ్వుతూ..

నాకు తెలిసి అతనంత గట్టిగా నవ్వడం మొదటిసారి.. "ఈ స్థితప్రజ్ఞుడికి ఒకప్పుడు యాంగర్ మేనేజ్మెంట్ పెద్ద సమస్య అనేది తెలుసా?" అన్నాడు హటాత్తుగా.

"వాట్, మీకసలు యాంగర్ అంటే తెలుసా? అని నా అనుమానం" అన్నాను నేను కూడా..

" కొన్ని ఆలస్యంగా తెలుస్తాయి! అప్పుడప్పుడు చాలా ఆలస్యంగా" అన్నాడు కళ్ళజోడు తీసి టేబిల్ మీద పెట్టి పేపర్ నేప్కిన్ తో ముఖం తుడుచుకుంటూ..

" ఏమయింది కెన్? ఆర్ యూ ఓకే?" అన్నాను ఆత్రంగా.. ఎక్కడో ఏదో కదపరానిది కదిపానేమో అనిపించింది నాకతని ముఖం చూస్తే.

మాట్లాడలేదు కెన్.. తుడుచుకున్నట్టుగా పేపర్ నేప్కిన్ లో ముఖం దాచుకుని ఉండిపోయాడు కొన్ని క్షణాలు.. ఆపైన

" యా ఐ.యాం.. నో.. ఐ. యాం నాట్.." అన్నాడు చిన్నబోయిన కంఠంతో..

" అరే, మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను నేననవసరంగా.." అన్నాను క్షమార్పణ ధ్వనిస్తున్న గొంతుతో. "లేదు.. దట్స్ ఓకే!!అన్నాడతను.

పరవాలేదు.. అన్నాడు. కానీనేను చెప్పింది మాత్రం నిజం! నేను ఒకప్పుడు విపరీతమైన యాంగర్ మేనేజ్మెంట్ తో బాధపడేవాడిని.

అది తగ్గడానికి, తగ్గించుకోవడానికీ నాకు చాలా కాలం పట్టింది, దానికి నేను చెల్లించిన పరిహారం మాత్రం మర్చిపోలేనిది.. మళ్ళీ తిరిగి తెచ్చుకోలేనిది..

అతని మనసులో ఏదో తెలియని బాధ సుళ్ళు తిరుగుతోంది..

"మీకు!!" అనేలోపున..

" నాకేం అభ్యంతరం లేదు.. చెప్తాను.." అంటూ

"నిజం, చాలా స్ట్రగుల్ అయ్యాను, జీవితంలో అత్యంత విలువైనవాటిని పోగొట్టుకుంటే కానీ తెలియనేలేదు. తెలిసేసరికి చాలా లేట్..

తల్లితండ్రులకొక్కడినే కొడుకుని, ఇద్దరక్కల తర్వాతా గారాబంగా పెరిగాను. అదే కారణమో, లేక నా తత్వమే అంతో మరి చిన్నప్పటినించీ పొగరుగా, నిర్లక్ష్యంగా ఉండేవాడి. మంకు పట్టూ ఎక్కువే నాకు. చదువులోనూ, గిటార్ వాయించడంలోనూ మాత్రం ఎప్పుడూ టాప్ గా ఉండేవాడిని. నా సంగీతం నాకెందరో అభిమానుల్ని తెచ్చింది. కాలేజ్ లోనూ, బయటా కూడా. మా టవున్ లో నా స్నేహితులతో కలిసి ఒక బాండ్ ఏర్పాటు చేసుకున్నాం, చుట్టుపక్కలన్నిచోట్లా ప్రదర్శనలిచ్చేవాళ్ళం. శలవుల్లో టూర్లు చేస్తూ రకరకాల ఊర్లు తిరిగేవాళ్ళం.. కాలేజ్ ఉన్నప్పుడు చదువుకోవడం, లేనప్పుడు సంగీతం.. ఇలా ఉండేది నా జీవితం.

నా స్నేహితులందరికీ నా విషయం తెలుసు, నా ముక్కుమీదుండే కోపం తెలుసు.. కానీ మంచి గిటారిస్ట్ ని పోగొట్టుకోవడం ఇష్టం లేక నన్ను భరించేవారు. స్వతహాగా మంచివాడినే, అలా అని నేననుకుంటాను కనక ఎవరూ పెద్దగా ఏమీ అనేవారు కాదనుకో, అంటూ నవ్వాడు

ఒక సారి ఓరెగాన్ రాష్ట్రంలో పోర్ట్ లాండ్ అనే ఊరిలో ప్రోగ్రాం ముగించుకుని రైల్లో మా ఊరికి వస్తున్నాం. అప్పుడు పరిచయం అయ్యింది లూసీ.. మా కాలేజ్ లోనే చదువుతోందనీ, మా బాండంటే ముఖ్యంగా నా గిటార్ వాయిద్యం అంటే తనకి చాలా ఇష్టం అనీ, తనకి వీలున్నప్పుడల్లా మా ప్రొగ్రాం లకి తరచూ వస్తుందనీ తెలిసింది..

మా ఇద్దరి మధ్యా స్నేహం, అది ఆపైన ప్రేమగా మారడానికి ఎక్కువ టైము పట్టలేదు. నా రెక్ లెస్ నెస్ ని, నిజం చెప్పాలంటే నా పొగరునే ఇష్టపడిందిట లూసీ..

తల్లి, సవతి తండ్రిదగ్గర ఎప్పుడూ క్రమశిక్షణ, భయం నీడలో పెరిగింది లూసీ. నేను నాకు నచ్చినట్టుగా ఉండే విధానమే తనకి చాలా నచ్చిందని, ఎప్పటికైనా తనూ అలా ఉండాలని అనుకునేదాన్నని తరచుగా చెప్పేది.

పెరిగింది చిన్న ఊరు, కరకుగా ఉండే సవతి తండ్రి, అతని నీడలో నిస్సహాయంగా ఉండిపోయిన తల్లి. వారిద్దరికీ పుట్టిన ఇద్దరు పిల్లలూ ఇదీ లూసీ కుటుంబ నేపథ్యం..

' కాలేజ్ కి వచ్చేవరకూ జైలులో ఉన్నట్టు ఉండేది కెన్! ఆ ఇంట్లోంచి బయటకు వచ్చేయడానికే నేను ఈ కాలేజ్ ఎంచుకున్నాను' అనేది నాతో..

'నీకు కోపం ఎక్కువ కెన్! తగ్గించుకోవాలి కాస్త' అనేది మా పరిచయం అయిన మూడునెలలతర్వాత.

జీవితం చిన్నది, ఎప్పుడేం కావాలంటే అప్పుడు చేసెయ్యాలి, లేకపోతే జీవితం చేజారిపోతుంది అనుకునే తత్వం నాది.. ఊరికే ప్లానింగ్ అనీ, ప్రణాళికలనీ టైం వేస్ట్ చేసుకోవడం నాకసలు నచ్చేది కాదు..

నాకుద్యోగం  వచ్చిన తర్వాత లూసీ పుట్టినరోజుకి నా ఒక నెల జీతమంతా ఖర్చుపెట్టి బిజినెస్ క్లాస్ టిక్కట్లు బుక్ చేసి తనకిష్టమైన వేగస్ కి తీసుకెళ్ళాను. తన జీవితంలోనే మరిచిపోలేని హాలిడే అని, తననింత ప్రత్యేకంగా చూసుకునే నేను తనకి దొరకడం తన అదృష్టమనీ అని మురిసిపోయింది. అంతలోనే అడిగింది

'ఇంత ఖరీదైన హాలిడే ఎందుకు కెన్? చాలా ఖర్చయి ఉంటుంది కదా?' అంది.. అసలు విషయం నేను చెప్పగానే ఆమె చాలా బాధగా

" జీతం అంతా వాడేశావా? ఇలా ముందూ, వెనకా చూసుకోకుండా ఇంత ఖర్చు పెడితే ఎలా?" అని తను అనగానే నాకు చర్రున కోపం వచ్చింది..

" లేకపోతే వేగస్ హాలిడేలు, బిజినెస్ క్లాస్ ట్రిప్ లు ఊరికే వస్తాయా?" అంటూ ఆమెమీద విరుచుకు పడ్డాను. అదే మొదటిసారి మా ఇద్దరి మధ్యాగొడవ జరగడం.

పట్టలేని కోపం వస్తే నన్ను పట్టుకోవడం ఎవరి తరం కాదు.. నామీద నాకే కంట్రోల్ ఉండదు.. తనన్న మాటలో తప్పేమీలేకపోయినా నా మాటలన్నీ భరించింది.. ఆతర్వాత తననుకున్న విషయం ఏమిటో అనునయంగా చెప్పింది.. నేను విని ఊరుకున్నాను.. రెండు మూడు రోజులు పడుతుంది నాకు మళ్ళీ మామూలు మనిషిని కావడానికి.

ఆ సంఘటన జరిగిన ఆరునెలలకి మేము పెళ్ళి చేసుకున్నాం.. మొదటినించీ టీచింగ్ అంటే ఆసక్తి కల లూసీ స్కూల్ టీచరయ్యింది. పిల్లలతో కాలం గడపడం, వారితో ఆడి పాడటం ఆమెకెంతో సంతోషం. ఇల్లు చక్కగా నడుపుకుంటూ, స్కూల్లో మంచి పేరు తెచ్చుకుంటూ జీవితాన్నెంతో ఆస్వాదిస్తూ ఉండేది. వీలైనంతవరకూ నాకు కోపం రాకుండా నన్ను ప్రశాంతంగా ఉంచడానికి ప్రయత్నించేది..

“మనకి నలుగురు పిల్లలుండాలి కెన్! నాకు ఇల్లంతా పిల్లలు తిరుగుతూ ఉంటే చాలా ఇష్టం.. ఆ దృశ్యం ఊహించుకోవడానికే ఎంత బావుంటుందో! నేను ముసలిదాన్నయేవరకూ నీ చేతిలో చెయ్యి వేసి నడవడం, ఆపైన నిన్నుదాటి వెళ్ళిపోవడం ఇదే నేను కోరుకునేది.. అనేది కళ్ళు మూసుకుని అవన్నీ ఊహించుకుంటూ..

" మనదైన ఒక చిన్న ఇల్లు, మన పిల్లలు.. నెరిసిన జుట్లతో నువ్వూ, నేను.. కళ్ళల్లో తృప్తీ, ఆనందం.. చాలు , ఇంతకంటే జీవితంలో ఇంకేమైనా కావాలా? అన్నట్టు చాల మంది మగవాళ్ళా నీకు బట్టతల వస్తేనో" అంటూ నవ్వేది..

ఆ మాట చెప్తూ కెన్ నవ్వుతున్నాడు. నవ్వి, పొలమారి దగ్గొచ్చేదాకా నవ్వాడు..

అతన్నలా చూస్తూ ఉండిపోయాను..

" మీకు నలుగురు పిల్లలున్నారా అయితే?" అన్నాను నేను. మళ్ళీ అదే వాగుడు.. అతన్ని చెప్పనివ్వచ్చు కదా.

" యా, ఐ విష్" అన్నాడు కెన్ భారంగా..

" సారీ" నేను అడగకుండా ఉండవలసింది కదా!" అన్నాను..

" పరవాలేదు. లూసీ నాతో ఉండి ఉంటే అలాగే ఉండేవారు, నలుగురు కాకపోయినా కనీసం ఇద్దరు.. “ అన్నాడు తనే..

" అరే, ఏమయింది??" అన్నాను నేను ఆత్రంగా..

“చెప్పానుగా, మనకి దగ్గరయిన వారు దూరమైతే కానీ మన దురవాట్లు దూరమవ్వవు.

నన్ను భరించలేక, నన్ను తన ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన లూసీ నన్నొదిలేసి వెళ్ళిపోయింది..

ఆమె కలల్నీ, సంతోషాల్నీనాతోనే పంచుకోవలనుకున్న జీవితాన్ని.. అన్నింటినీ వదిలేసి.. నన్నొదిలేసి..

కడవరకూ, అంటే మలివయసులో ముడతలు పడ్డకా కూడా నా చెయ్యి పట్టుకుని వదలను అన్న తన కోరికని వదిలేసి..

నాకందనంత దూరంగా..” ఆ మాటలంటున్నప్పుడు కెన్ కళ్ళల్లో నీళ్ళు..

ఏమనాలో తెలియలేదు నాకు..

ఎప్పటినించో తనలో ఘనీభవించిన ఫీలింగ్స్ అన్నీ కరుగుతున్నట్టుగా ఉండిపోయాడు.

“అంటే లూసీ గారు??” అన్నాను

“అవి గుర్తు చేసుకోవడానికి కూడా ఇష్టపడలేను.. నా యాంగర్ ఇస్యూలవల్లనే లూసీ దూరమయింది అన్నది నిజం.. మిగతావన్నీ జరగడం యాదృచ్ఛికం అనిపిస్తుంది నాకు.. లేకపోతే ఎంతో ఆనందంగా, ఆరోగ్యంగా తిరిగే లూసీకి, ఎలా వచ్చాయో తెలీని కాంప్లికేషన్స్ రావడం..నేను మర్చిపోలేను.. గుర్తుచేసుకోలేను..

చిన్నప్పటినించీ ఆమె సవతి తండ్రి పీటర్ కట్టుదిట్టాల్లో, ఆయన కోపతాపాలకి గురవుతూ, క్రమశిక్షణ పేరుతో బందిఖానలాంటి ఇంట్లో పెరిగాను కెన్.. మళ్ళీ అదే జీవితంలోకి వెళ్ళిపోతానేమో అని భయం వేస్తోంది..

నీ కోపం భరించగలను, నీ చిరాకుని తట్టుకోగలను.. కానీ ఎప్పుడెలా ప్రవర్తిస్తావో తెలియని అనిశ్చితిని తట్టుకోలేను.. దేనికి కోపం వస్తుందో కూడా తెలీదు నాకే కాదు, నీకు కూడా. అయినా నీ మీద నాకున్న ప్రేమ బలమే గొప్పది, అందుకే ఇంకా నీతోనే ఉండాలనే కోరిక చంపుకోలేకపోతున్నాను.. కెన్! నీ దారి మార్చుకో, నాకోసం!, నీకోసం... మనకి పుట్టబోయే బిడ్డ కోసం.. అని తను చెప్పిన రోజు..ఆ శుభవార్త నా చెవుల్లో అమృతం పోసింది..

నీకు తెలుసా శ్రీకర్! కేవలం తనకోసంయాంగర్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం లో చేరాను.. మనసుని ప్రశాంతంగా ఉంచుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాను.. అవి నాకు కావలసిన ఫలితాలు చూపిస్తున్నయని మా ఇద్దరికీ నమ్మకం కలగడం మొదల్యింది..

పెరుగుతున్న తన పొట్ట మీద నా చెయ్యి ఉంచి మరీ నన్ను ప్రామిస్ చెయ్యమనేది.. మాకు పుట్టబోయే బిడ్డకి అవన్నీ వినిపిస్తాయని ఎన్నో కబుర్లు చెప్పేది..కానీ అంతలోనే డెలివరీ టైములో కోలుకోలేని కాంప్లికేషన్స్ వల్లా.. చెప్పలేక ఆగిపోయాడు..

అంతలోనే తేరుకుని..

అంతే!! ఆరోజు నాకు మొదటిసారి ఎక్కడుంటాడో తెలియని దేవుడి మీద పట్టరాని కోపం వచ్చింది.. ఏం చెయ్యాలో, ఎవరినేమనాలో తెలీని అసహాయత్వం.. తెలియని వేదన.. లూసినిదూరం చేసుకున్నాకా మూడునెల్లు నా ఇష్టం వచ్చినట్టు తిరిగాను, గమ్యం లేదు, గమనం తప్ప..

రైలు, బస్సు, విమానం, కారు.. ఏది కనిపిస్తే అది ఎక్కాను. ఎక్కడ ఉండాలనిపిస్తే అక్కడ ఉన్నాను. తిన్నానో, లేదో కూడా తెలియనంత.

మూడునెల్లు.. నాలో నేను తొంగి చూసుకున్నాను, నా తప్పులు నేనే ఎంచుకున్నాను.. నాలో లూసీ మెచ్చుకున్న లక్షణాలన్నింటినీ పునశ్చరణ చేసుకుని ఆ బలం మీద, కేవలం దానిమీదే నా జీవితాన్ని తిరిగి నిర్మించుకోవాలాని నిర్ణయించుకున్నాను.. రొద తప్ప మరేమె లేని ఆ మహానగరం నించి లూసి వాళ్ళ స్వంత ఊరైన ఇక్కడికి వచ్చేశాను. ఇక్కడ ప్రతీ చోటా లూసి తిరిగింది, మసలింది అనుకుంటేనే నాకు ఎంతో హాయిగా ఉంటుంది. ఆమె చదివిన స్కూల్, ఎక్సర్సైజ్ కోసం పరిగెత్తిన పార్క్ ఇలా ప్రతీ చోటా ఆమె జ్ఞాపకాలు.. అవే నాకు బలం, బలహీనత కూడా.. అయినా ఐ లవ్ ఇట్. ఆరోజునే ఈ కెన్ పుట్టాడు, నా గుండెల్లోనూ, గుండెలమీద ఉన్న లూసీ సాక్షిగా.. అన్నాడు తన చాతీ మెద్దున్న లూసీ పేరున్న పచ్చ బొట్టు చూపిస్తూ..

నువ్వు నాలో మెచ్చుకునే గుణాలన్నీ నాకప్పటినించీ వచ్చినవేనేను జీవితంలో తట్టుకోలేని దెబ్బ తిన్నాకా, అత్యంత ప్రియమైనవి కోల్పోయాకా నన్ను కదిపేవీ, కదిలించేవీ మరేమీ లేకపోయాకా ఇంకేం ఉంది?

పోగొట్టుకోవడానికేమీ లేకపోయాకా పోరాటమే లేదుగా.. దేరీజ్ నతింగ్ మోర్ టు లూస్!! లూసీ జ్ఞాపకాలు నాకు దిశానిర్దేశనం చేస్తాయి.. నన్ను బ్రతికిస్తూ ఉంటాయి.. గతంలోకి తొంగిచూస్తూవర్తమానాన్ని వెలిగిస్తాయి.. అంతే!!" అన్నాడు నిశ్వసిస్తూ..

నా కెందుకో అప్రయత్నంగానే కళ్ళ నీళ్ళు తిరిగాయి...

●●●

Click here to share your comments on this story